ప్రజాశక్తి
బుధవారం 5 మార్చి 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అందని బిల్లులు

- పల్లె పండుగతో కాంట్రాక్టర్లు అప్పులపాలు
- నిర్మాణ పనులపై ప్రభావం

బిబ్బిడి పంచాయతీ జంక్షన్ నుంచి వాటర్ ట్యాంక్ వరకు నిర్మించిన సిసి రోడ్డు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, బుచ్చెయ్యపేట విలేకరి

జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) నిధులతో రహదారి నిర్మాణ పనులు చేసిన చిన్నపాటి కాంట్రాక్టర్లు బిల్లులు అందక లబోదిబోమంటున్నారు. పంచాయతీ తీర్మానాల ప్రకారం గ్రామాల్లో పల్లె పండుగ కింద కొత్త రహదారుల నిర్మాణాలను కూటమి ప్రభుత్వానికి చెందిన స్థానిక నాయకులు చేపట్టారు. తమ ప్రభుత్వంలో బిల్లులకు ఇబ్బందులుండవని అప్పులుచేసి గ్రామాల్లో అప్పగించిన తారు రోడ్లు, సిసి రోడ్లు పూర్తిచేశారు. ఉపాధి హామీ మెటీరియల్ నిధులతో చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపులో అంతరాయం ఉండదన్న ధీమాతో చాలా మంది నిర్దిష్ట కాలపరిమితిలో రహదారి పనులు పూర్తిచేసి అప్పగించారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఇప్పుడు కార్యాలయాల చుట్టూ వారు తిరుగుతున్నారు. జిల్లాలోని కాంట్రాక్టర్లకు దాదాపు రూ.58 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సివుంది. డిసెంబరు రెండో వారంలో పనులు పూర్తిచేసినా, ఇంతవరకు బిల్లులు చెల్లించకపోవడంతో వడ్డీల భారం పెరుగుతుందని కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంజూరైన నిధులు మురిగిపోకుండా ఈ ఏడాది మార్చి 31వ తేదీ లోపు నిధులను పూర్తిగా వినియోగించాలని అధికారులు భావించారు. అయితే పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో మిగిలిన పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకురావడంలేదు. ఒకటి రెండు రోజుల్లో బిల్లులు పడతాయని డిసెంబరు నుంచి అధికారులు చెప్పుకుంటూ వస్తున్నారు కానీ జమ కావడంలేదు.

జిల్లాలో 245 పంచాయతీల పరిధిలో పల్లె పండుగ కింద రూ.147.92 కోట్ల విలువైన సిమెంట్ రోడ్లు, తారు రోడ్లు, డబ్ల్యుబిఎం రోడ్ల నిర్మాణాలు మంజూరయ్యాయి. సిఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసిన దాదాపు రూ.68 కోట్ల విలువైన బిల్లులో రూ.పది కోట్లు కాంట్రాక్టర్లకు మిగతా 2లో..

విశాఖకు ముఖ్యమంత్రి చంద్రబాబు

- నేటి రాత్రికి టిడిపి ఆఫీసులో బస
- 6న గీతం యూనివర్శిటీలో కార్యక్రమానికి హాజరు
- రేపు కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ రాక

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 5వ తేదీ రాత్రి 11.45గంటలకు విశాఖకు విచ్చేస్తున్నారు. నేరుగా ఢిల్లీ విమానాశ్రయం నుంచి రాత్రి విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. ఈ మేరకు ఖరారైన షెడ్యూల్ ప్రకారం 6వ తేదీ మధ్యాహ్నం రుషికొండ గీతం ఇంజినీరింగ్ కాలేజీలో జరిగే ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన విచ్చేస్తున్నారు. ముందు రోజు 5వ తేదీ రాత్రి నగరంలోని రామ్‌నగర్ (ఎన్‌టిఆర్ భవన్) టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో బస చేస్తారు. ఏపి బిజెపి అధ్యక్షులు దగ్గుబాటి పురంధరేశ్వరి భర్త దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన ఒక పుస్తకాన్ని 6న మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఇక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు. 6వ తేదీ రాత్రి కూడా విశాఖలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు టిడిపి ఆఫీసులో బస చేయనున్నట్లు తెలుస్తోంది.

కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలాసీతారామన్ ఈనెల 6న విశాఖలోని నోవటెల్‌లో జరిగే పోస్ట్ బడ్జెట్ ఇంటరాక్షన్ సెషన్‌లో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు విచ్చేస్తున్నారు. నిర్మలా సీతారామన్ 6న ఉదయం విశాఖకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12.30గంటలకు నోవటెల్‌లో జరిగే ఈ కార్యక్రమంలోనూ అనంతరం మధ్యాహ్నం 3.30గంటల నుంచి జరిగే మీడియా ఇంటరాక్షన్‌లోనూ కేంద్ర మంత్రి పాల్గొననున్నారు.

విశాఖ గీతంలో 5, 6 తేదీల్లో 10000 ఉద్యోగాలకు జాబ్ ఫెయిర్..

విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీలో నాస్కామ్ ప్రైమ్ కెరియర్ ఫెయిర్ 10వేల ఫ్లెష్ జాబ్స్ యువత కోసం గీతం చైర్మన్, విశాఖపట్నం ఎంపీ ముతుకుమిల్లి శ్రీభరత్ నిర్వహిస్తున్నారు. 2024 - 2025లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న మిగతా 2లో..

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఫలితం కూటమి పాలనకు చెంపపెట్టు

▶ వార్త మెయిన్‌లో..

విశాఖ వేదికగా 2 ఐపిఎల్ మ్యాచ్‌లు : ఎసిఎ అధ్యక్షులు కేశినేని శివనాథ్

▶ వార్త మెయిన్‌లో..

అచ్చెన్న వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి : యుటిఎఫ్

▶ వార్త 4లో..

'పది' పరీక్షలకు ఏర్పాట్లు

- 134 కేంద్రాలు
- హాజరుకానున్న 29,997 మంది విద్యార్థులు
- డిఇఒ ప్రేమ్‌కుమార్

ప్రజాశక్తి - ఆరిలోవ

మార్చి 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేసామని, ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని అర్బన్‌లో 98, గ్రామీణ ప్రాంతంలో 56 కలిపి మొత్తం 134 కేంద్రాలను ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన వెలువరించారు. ఈ పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 28,523, ఓపెన్ విద్యార్థులు 1,404 కలిపి మొత్తం 29,997 మంది హాజరవుతున్నారని పేర్కొన్నారు. వారిలో బాలలు 15,094 మంది కాగా బాలికలు 13,429 మంది ఉన్నారని వివరించారు. రెగ్యులర్ విద్యార్థులకు రోజూ ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు, ఓపెన్ విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. కాంపోజిట్, ఒకేషనల్ కోర్సులకు ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం రోజు విడిచి రోజు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. అన్ని విభాగాల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు.

సర్వే కార్యక్రమాలను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువుగా అందించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల కీలక కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చేపట్టాల్సిన పలు సర్వేల పురోగతిపై సమీక్షించారు. పి 4 సర్వే, మిస్సింగ్ హౌస్ హోల్డ్ డేటా, ఎంఎస్ఎంఇ సర్వే, వర్క్ ఫ్రం హోమ్, హౌస్ ఇమేజ్, జియో కో-ఆర్డినేట్లు, తోలు కళాకారుల సర్వేలను మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఆధార్ లేని పిల్లలను గుర్తించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో సర్వేను ధ్రువీకరించాలని సూచించారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి సర్వే పురోగతిని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సర్వేలు సమర్థంగా నిర్వహించడం ద్వారా ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వేగంగా అందించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఎల్‌డిఒ ఉషారాణి, జోనల్ కమిషనర్లు హాజరయ్యారు. ఎంపిడిఒలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

అందని బిల్లులు

చెల్లించారు. ఇంకా రూ.58 కోట్లు చెల్లించాల్సివుంది. రూ.78 కోట్ల విలువైన పనులు జరిగినప్పటికీ రూ.68 కోట్ల విలువైన బిల్లులు అప్‌లోడ్ జరిగాయి. బిల్లుల చెల్లింపులో జరుగుతున్న జాప్యంతో కొత్త పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకురావడంలేదు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు మూడు రకాల రహదారుల నిర్మాణాలు పూర్తిచేయాలని అనుకున్నప్పటికీ బిల్లులు సకాలంలో రాకపోవడంతో ఆ ప్రభావం నిర్మాణాలపై పడింది. గతేడాది అక్టోబర్‌లో ప్రారంభించిన రహదారుల పనులు నవంబరు, డిసెంబరులో పూర్తిచేశారు. కానీ బిల్లులు రాక కొత్త పనులు చేపట్టంలేదు. 224.91 కిలోమీటర్ల రహదారిలో 81.09 కిలోమీటర్లలో రహదారి పనులు వివిధ దశల్లో ఉండగా, 26.56 కిలోమీటర్లలో నిర్మాణ పనులు ప్రారంభించలేదు.

విశాఖకు ముఖ్యమంత్రి చంద్రబాబు

టెక్, నాన్ టెక్, ఐటిఐ, పాలిటెక్నిక్, డిప్లమో విద్యార్థుల కోసం 10 వేలకుపైగా ఉద్యోగాలను ఐటి, మాన్యుఫ్యాక్చరింగ్, ఫైనాన్స్, రిటైల్స్, లాజిస్టిక్స్, ఇతర రంగాల్లో నాస్కమ్, గీతం ఆధ్వర్యాన నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఇక్కడ యువత జాబ్స్ కోసం ఏర్పాట్లను చేపట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు 6న రానుండడంతో ఆయన్ను ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లేకపోలేదు. కేంద్ర ఆర్థిక మంత్రి నోవటల్‌లోనూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గీతం సంస్థలో 6న పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేస్తుండడంతో టిడిపి, కూటమి నేతల్లో హడావుడి కనిపిస్తోంది.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

మహిళా దినోత్సవ ఏర్పాట్లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అన్ని రకాల ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురజాడ కళాక్షేత్రం వేదికగా జరుగునుందని తెలిపారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల తరపున చేపట్టాల్సిన ఏర్పాట్లపై మార్గదర్శనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు, నిబంధనలకనుగుణంగా మహిళా దినోత్సవం నాటికి పూర్తి చేయాలని పేర్కొన్నారు. క్రీడా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన వివిధ శాఖల మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ వ్యాసరచన, ఉపన్యాసం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని తెలిపారు. మహిళా సంఘాలు, ఎన్జీవోలను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. బ్యాంకర్లు పెండింగ్‌లో ఉన్న ఎంఎస్ఎంఇ రుణాల మంజూరుపై దృష్టి సారించాలన్నారు. మహిళా శిశు సంక్షేమ, సాంఘిక సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్య, పోలీస్, గ్రామీణ పేదరిక నిర్మూలన, విద్యాశాఖ తదితర శాఖలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమీక్ష సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కాంట్రాక్టు శానిటేషన్ వర్కర్లకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్టు శానిటేషన్ కార్మికులు మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎఐటియుసి ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అమలు చేయని కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కనీస వేతనం రూ.35 వేలు చెల్లించాలని, బేసిక్ వేతనంతో పాటు డిఎ, గ్రాట్యుటీ, ఇతర అలవెన్సులు, కుటుంబానికి మెడికల్ అలవెన్స్ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె అచ్యుతరావు, అధ్యక్షులు ఎం.మన్మధరావు, నాయకులు జెడి.నాయుడు, రాజబాబు, అప్పలరాజు, గణేష్, పడాల రమణ, జి.వామనమూర్తి, పడాల గోవింద్, కాసుబాబు, ఎన్.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీలోని సమస్యలపై విసికి ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రా యూనివర్సిటీలో గత కొంతకాలంగా సరైన ప్రణాళిక లేక తీవ్రమైన విద్యారంగ సమస్యలు ఏర్పడ్డాయని, వీటిని పరిష్కరించాలని కోరుతూ ఎయు ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం విసి ఆచార్య జిపి.రాజశేఖర్‌కు వినతిపత్రం అందించారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫిజియన్స్ మెంట్ వర్తించిన సరే నెలకు విద్యార్థుల నుండి రూ.3,500కు పైగా ఫీజు వసూలు చేస్తున్నారుని, ఫీజు చెల్లించకుంటే హాస్టల్ మెస్ కార్డులను నిలిపివేస్తున్నారని వివరించారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న అంధ్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక మొత్తంలో రుసుం చెల్లించడంలో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. హాస్టల్స్ వసతి ధరలు చాలా అధికంగా ఉన్నాయని, తగ్గించాలని కోరారు. ప్రస్తుతం కొన్ని హాస్టళ్లలో మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడం, నీరు లేక విద్యార్థులు సకాలంలో తరగతులకు చేరుకోవడం ఇబ్బందిగా మారుతోందని, మహిళల హాస్టల్‌లో ఎలుకలు తిరుగుతూ వస్త్రాలు, పాఠ్యపుస్తకాలను పాడుచేస్తున్నాయని వివరించారు. నలుగురికి సరిపోయే గదులను ఐదుగురు విద్యార్థులకు కేటాయించారని తెలిపారు. కొన్ని వసతి గృహాలకు ఆనుకొని రీడింగ్ రూమ్స్ ఉన్నాయి. వాటిలో పుస్తకాలు, సాహిత్యం లోపించాయని, కూర్చోవడానికి కనీసం కుర్చీలు కూడా లేవని, సర్దుబాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఆంధ్రా యూనివర్సిటీ కార్యదర్శి వెంకటరమణ, సహాయ కార్యదర్శి జి.అజయ్, జిల్లా సహాయ కార్యదర్శి పి.సాయి పాల్గొన్నారు.

ఎయు విసికి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

కెఎ.పాల్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దేశంలోని న్యాయ స్థానాలలో లక్షల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సాధ్యమైనంత తొందరగా పరిష్కరించాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ.పాల్ డిమాండ్ చేశారు. ఆశీల్‌మెట్ట సమీపంలోని కెఎ.పాల్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కోర్టు తీర్పుల విషయంలో సత్వర న్యాయం జరగడం లేదన్నారు. త్వరలో హ్యూమన్ రైట్స్, ఫండమెంటల్ రైట్స్, ఇండివిడ్యువల్ రైట్స్‌తో భారత న్యాయవ్యవస్థపై పోరాటం చేస్తానని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో కూటమి ప్రభుత్వం ఓడిపోయిందని, డబ్బులు ఖర్చు పెట్టి కృష్ణ, గోదావరి జిల్లాలో కూటమి ఎమ్మెల్సీ సీటు గెలిచిందని ఆరోపించారు. జగన్మోహన్‌రెడ్డి ప్రజల కోసం పోరాటం చేస్తూ అసెంబ్లీకి వెళ్లి ప్రశ్నించాలని కోరారు. ప్రశ్నించినందుకు నటుడు పోసాని కృష్ణమురళిపై 14 కేసులు పెట్టారని, మరి పవన్ కల్యాణ్‌ను తిట్టి రోడ్డుపై నడిపిస్తానని అన్న వారి మీద కేసులు పెట్టరా అని ప్రశ్నించారు. త్వరలో నాని, రోజాను, ఆ తర్వాత జగన్మోహన్‌రెడ్డిని అరెస్టు చేస్తారని చెప్పారు. ట్రంప్ భేటీతో మోడీ విశ్వగురు కాదని తేలిపోయిందన్నారు. ఈవీఎంలను తీసి బ్యాలెట్ పెట్టాలని కోరారు. 30 వేల మంది మహిళలు మిస్ అయ్యారని, నిరుద్యోగులకు ఉద్యోగాలని చెప్పి పవన్ ప్రజలను మోసం చేశారన్నారు. అదాని, అంబానీల కంపెనీలకు మాత్రమే మోడీ అనుమతి ఇస్తున్నారని, ఇతర కంపెనీలు రాకపోతే నిరుద్యోగ సమస్య ఎలా పరిష్కారం అవుతుందని ప్రశ్నించారు. ప్రధాని మోడీ మతాల మధ్య యుద్ధం పెడుతున్నారని, మణిపూర్‌లోని మహిళలను వివస్త్రలను చేసి చంపుతున్నారన్నారని విచారం వ్యక్తం చేశారు. మోడీ, అమిత్ షా నుండి దేశాన్ని రక్షించడానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు కలిసి ఎదుర్కోవాలని కోరుకుంటున్నానని తెలిపారు.

సంక్రాంతికి వస్తున్నాం చిత్ర సంబరాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతికి వస్తున్నాం చిత్రం విజయవంతంగా 50 రోజులు ప్రదర్శించిన సందర్భంగా మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జిల్లా, సిటీ వైడ్ వెంకటేష్, రానా ఫాన్స్ ఆధ్వర్యాన విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర ఫిలిమ్స్ మేనేజర్ విజయభాస్కర్, సురేష్ ఫిలిమ్స్ మేనేజర్ వేణుబాబు, ఫ్యాన్స్ గౌరవ సలహాదారు గంటల శ్రీనుబాబు మాట్లాడుతూ, సంక్రాంతికి వస్తున్నాం చిత్రం విజయవంతంగా 50 రోజుల ప్రదర్శించి, రూ.300 కోట్లకు పైగా గ్రాస్ కలక్షన్స్ రికార్డు సృష్టించిందన్నారు. హీరో వెంకటేష్ నటించిన ఈ చిత్రం, ఆయన సినీ కెరీర్‌లో బ్లాక్ బస్టర్ హిట్ అన్నారు. రాష్ట్రంలో 20 కేంద్రాలలో 50 రోజులు చిత్రం ప్రదర్శన జరిగిందని, ఈ జైత్రయాత్ర ఇంకా కొనసాగుతుందని పేర్కొన్నారు. 50 రోజుల సినిమా విజయోత్సవాన్ని పురస్కరించుకొని లీలామహల్ థియేటర్ సిబ్బందికి నిత్యవసర వస్తువులను ముఖ్య అతిథుల ద్వారా పంపిణీ చేశారు. కార్యక్రములో పిల్లి శంకరరావు, కృష్ణ, ఎఎన్ఆర్, మోహన్‌బాబు సంఘాల నాయకులు మన్యాల శ్రీనివాసు, గణేష్, దిబ్బ శంకరరావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎస్ఎల్‌లో జాతీయ భద్రతా దినోత్సవం

విద్యార్థినికి బహుమతి అందిస్తున్న హెచ్ఎస్ఎల్ ప్రతినిధులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : "వికసిత్ భారత్‌కు భద్రత, శ్రేయస్సు కీలకం' అనే థీమ్‌తో హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ 54వ జాతీయ భద్రతా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించింది. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ ప్రొడక్షన్ జిఎం ఎన్.అశోక్‌కుమార్ ఉద్యోగులందరితో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం హెచ్ఎస్ఎల్ సిఎమ్‌డి హేమంత్ ఖత్రి మాట్లాడుతూ, దైనందిన జీవితంలో ఆరోగ్యం, భద్రత పర్యావరణం ప్రాముఖ్యతను వివరించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి యార్డులోకి ప్రవేశించే కార్మికులకు 100 శాతం బీమా కవరేజీని ప్రకటించారు. క్షేత్రస్థాయి నుంచి భద్రతను పెంపొందించడానికి ఉద్దేశించిన రెస్క్యూ 2.0 ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని సిఎమ్‌డి ఆవిష్కరించారు. ఆయా విభాగాల్లో భద్రతా సంస్కృతిని పెంపొందించాలని సూచించారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేశారు.

గర్భాశయ కేన్సర్ వైరస్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సర్వైకల్ కేన్సర్‌కు కారణమైన హెచ్‌పివి వైరస్ అవగాహన దినాన్ని పురస్కరించుకొని ఫాగ్సి (జాతీయ స్త్రీ వైద్యుల సంఘం), ఒజిఎస్‌వి (విశాఖపట్నం ప్రసూతి స్త్రీ వైద్యుల సంఘం), ఎంఎస్‌డి ఫార్మా సహకారంతో హెచ్‌పివి వ్యాక్సిన్‌పై నగరంలోని రాక్‌డైల్ హోటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ, 9 నుంచి 14 సంవత్సరాల వయసు గల బాలికలకు రెండు డోసుల హెచ్‌పివి వ్యాక్సిన్ వేయిస్తే సర్వైకల్ కేన్సర్‌ను నివారించవచ్చని చెప్పారు. ఈ వ్యాధిని నేషనల్ ఇమ్యునిజైజేషన్ షెడ్యూల్లో చేర్చి ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా ఒజిఎస్‌వి ప్రెసిడెంట్ డాక్టర్ వైఎల్.నర్సింగరావు, కార్యదర్శి డాక్టర్ కిరణ్మయి హెచ్‌పివి వ్యాక్సిన్‌పై ఫాక్సి లోగోను విడుదల చేశారు. అనంతరం జరిగిన సభలో డాక్టర్ ఐ.వాణి, డాక్టర్ నిహారిక ప్రసంగించగా జాతీయ గైనిక్ ప్రెసిడెంట్ సునీత తండు లవల్కర్ వీడియో సందేశం అందించారు.

హెచ్‌పివి వ్యాక్సిన్ ఫాక్సి లోగోను విడుదలచేస్తున్న వైఎల్.నర్సింగరావు తదితరులు

మహారాజశ్రీ 8వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

M.V.O.P. No. 577/2023

Between:
Midipati Chandra Sekhar
...Petitioner
AND
Nitish Kumar and Others
...Resondents

R-2: M/s. Sowbhagya Enterprises, Rep. Gadde Phaniswar, Malem, Hindu, age not known, Owner of Lorry bearing No: AP-39-UP-2678, R/o. Flat No. 409, Legend Apartments, Near Ayyappa Swamy Temple, Sheela Nagar, Visakhapatnam.
...2nd Respondent

పై నెంబరు పిటీషన్‌లో 2వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 26-3-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటీషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

బి.మహేష్‌కుమార్
అడ్వకేట్, రాజమండ్రి
సెల్:8885551188

రాజమండ్రి
01-3-2025

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

చేపలుప్పాడలో పశు టీకాలు వేస్తున్న వెటర్నరీ సిబ్బంది

ప్రజాశక్తి -భీమునిపట్నం : గాలికుంటు వ్యాధి నివారణకు నాలుగు మాసాలు దాటిన పశువులకు తప్పని సరిగా టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ విశాఖ డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ మోపాడ చంద్ర శేఖర్ పాడిరైతులకు సూచించారు. మంగళవారం చేపలుప్పాడ, యాత కుమ్మరిపాలెం, దాకమర్రిలో గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లోసిస్ వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలో 12,014 పశువులకు టీకాలు వేయాలన్నది లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వెటర్నరీ సహాయ సంచాలకులు డాక్టర్ బి వెంకటరమణ, తాళ్ళ వలస పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్‌జి ప్రశాంతి, సిబ్బంది పాల్గొన్నారు

6న అనంత పద్మనాభుని పెళ్లిరాట

ప్రజాశక్తి -పద్మనాభం. అనంతపద్మనాభస్వామి కల్యాణానికి ఈనెల 6న పెళ్లిరాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ నానాజీబాబు తెలిపారు. పద్మనాభం అనంత పద్మనాభస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవంలో భాగంగా కుంతీమాధవస్వామి ఆలయం ప్రాంగణంలోని గాలిగోపురం వద్ద నిర్వహించే పెళ్లిరాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పరిశ్రమల స్థాపనపై అవగాహన

ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం పరిశ్రమల స్థాపన, ఉద్యోగావకాశాలు ఎలా పొందవచ్చు అన్న అంశాలపై అవగాహన కల్పించారు. సానుకూల దృక్పథం తో ఆలోచించాలని కళాశాల ప్రిన్సిపాల్ బి మురళీకృష్ణ విద్యార్థులకు సూచించారు. డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, మేనేజ్మెంట్ విభాగాధిపతి రాము, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

పార్టీ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలి

నాగిరెడ్డికి దరఖాస్తు అందజేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి -గాజువాక : పార్టీ పదవుల నియామకాల్లో సీనియర్లకు ప్రాధాన్యతనివ్వాలని జివిఎంసి 86వ వార్డు వైసిపి నేతలు కోరారు. మంగళవారం పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ డిప్యూటీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి తిప్పల దేవన్ రెడ్డికి కలిసి దరఖాస్తులు అందజేశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి యువతతోపాటు అన్నివర్గాల నుంచి పార్టీకి సేవలు అందించిన వారిని గుర్తించాలన్నారు. వైసిపి వార్డు నాయకులు ఎన్నేటి రమణ, దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు, ముద్దపు మురళీమోహన్, మళ్ల సూరిబాబు, ఎన్ శ్రీనివాస్, బండారు గణేష్, దాసరి సాయి ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు పోషకాహార కిట్లు

ప్రజాశక్తి- గాజువాక : ఆరోగ్యం పట్ల పారిశుధ్య కార్మికులు తగిన శ్రద్ధ తీసుకోవాలని గాజువాక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కోరారు. మంగళవారం లుపిన్ ఫార్మా సిఎస్ఆర్ సేవల్లో భాగంగా గాజువాక జోన్ పారిశుధ్య కార్మికులకు పోషక విలువలతో కూడిన పదార్థాల కిట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి లుపిన్ కంపెనీ యాజమాన్యం గతంలో వైద్యశిబిరాలను నిర్వహించిందని, ప్రస్తుతం పోషక కిట్లు అందజేసిందన్నారు.

హానికారక డంపింగ్ యార్డు తరలించాలి

డంపింగ్ యార్డు పరిశీలిస్తున్న జగన్, ఇతర నేతలు

ప్రజాశక్తి -ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డు ఆటోనగర్ ఇ-బ్లాక్‌లోని హానికారక డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తరలించాలని, లేకుంటే ధర్నా చేపట్టక తప్పదని స్థానిక కార్పొరేటర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాధం (జగన్) హెచ్చరించారు. మంగళవారం స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి డంపింగ్‌యార్డు స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటోనగర్‌లోని కంపెనీల నుంచి వ్యర్థాలు తీసుకువచ్చి వేయడం వల్ల డంపింగ్ యార్డ్‌గా మారిందని, రాత్రి వేళల్లో ఇక్కడ పోగేసిన చెత్తాచెదారం, వ్యర్థాలను తగలబెట్టడం వల్ల దుర్వాసన, పొగ కాలుష్యంతో సమీప కాలనీవాసులు నరకయాతన పడుతున్నారన్నారు.

గతంలో తిరుమల నగర్‌కు ఆనుకొని ఉన్న కంపెనీల నుంచి వెలువడే వ్యర్థ రసాయనాలు భూమిలో ఇంకి, భూగర్భజలాలు కలుషిత కావడంతో ఇక్కడి ప్రజలు చర్మవ్యాధులతో బాధపడ్డారని, ఇపుడు డంపింగ్ యార్డు కాలుష్యంతో కొత్తకష్టాలు మొదలయ్యాయన్నారు. తక్షణమే డంపింగ్‌యార్డు తరలించకుంటే ఐలా కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ చైర్మన్ విజయరామరాజు, వార్డు అధ్యక్షులు రాజన్‌రాజు, జిల్లా నాయకులు డి.వి.అప్పారావు, సిరసపల్లి బాబూరావు, పావడ రమణమూర్తి, ప్రగడ దానయ్య, విశ్వేశ్వరరావు, బొండా శ్రీను, భాగ్యలక్ష్మి, కిరణ్, కల్యాణ్ చక్రవర్తి, తిరుమల నగర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సాంకేతిక కాలేజీలో ప్రాంగణ ఎంపికలు

క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి -మధురవాడ : పిఎంపాలెంలోని సాంకేతిక టెక్నికల్ క్యాంపస్‌లో మంగళవారం యోకోహామా టైర్స్ తయారీ సంస్థ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. క్యాంపస్ సెలెక్షన్స్‌కు సాంకేతిక పాలిటెక్నిక్ కాలేజీతోపాటు వివిధ కళాశాలల నుండి 215 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 45 మంది డిప్లొమా విద్యార్థులను ఎంపిక చేసినట్లు యోకోహామా సంస్థ హెచ్‌ఆర్ గుర్జార్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు అభినందించారు.

గతనెలలో రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 159 మంది ఎంపిక కాగా, వచ్చే వారం మద్రాస్ ఇంజనీరింగ్ ఇండస్ట్రీస్‌క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనుందని ఆళ్వార్‌దాస్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుంకరి రాహుల్ ఆళ్వార్‌దాస్ తెలిపారు.

ఎంపికైన విద్యార్థులతోపాటు వారిని సన్నద్ధం చేసిన అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆళ్వార్‌దాస్ గ్రూప్ సెక్రటరీ డాక్టర్ ఎస్‌విహెచ్. రాజేంద్ర, సాంకేతిక టెక్నికల్ క్యాంపస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధుభట్, అడ్మిషన్స్ ఆఫీసర్, కోఆర్డినేటర్ ఎ.నాగేశ్వరరావు,హెచ్ఆర్, సిఆర్ఎం అక్షత కొండూర్, క్రియేటివ్ డైరెక్టర్ విష్ణు కొండూర్, సంస్థ అకడమిక్ డైరెక్టర్ వి. శివరాం ప్రసాద్, సాంకేతిక పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ ఎ. రామకృష్ణ, ఆళ్వార్‌దాస్ గ్రూప్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.తులసికృష్ణకుమార్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

నాస్కామ్ కెరీర్ ఫెయిర్‌కు విశేష స్పందన

నేడు, రేపు గీతం వేదికగా నిర్వహణ : భారీగా పేర్లు నమోదు చేసుకున్న యువత

ప్రజాశక్తి- మధురవాడ : ఎపి ఉన్నత విద్యామండలి, నైపుణ్యాభివృద్ధి సంస్థలతో కలిసి నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్) ఈ నెల 5,6 తేదీలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహిస్తున్న కెరీర్ ఫెయిర్‌కు విశేష స్పందన లభించింది. ఈ కెరీర్ ఫెయిర్‌లో పాల్గొనడానికి రాష్ట్రంలోనివివిధ జిల్లాల నుంచి 33,682 మంది యువత తమ పేర్లను నమోదు చేయించుకున్నారని నిర్వాహక కమిటీ తెలిపింది. కెరీర్ ఫెయిర్‌కు ఇంజనీరింగ్ తదితర సాంకేతిక విద్యార్హతలున్న వారితో పాటు ఆర్ట్స్, సైన్స్, ఐటిఐ, పాలిటెక్నిక్ డిప్లమా పూర్తిచేసిన విద్యార్థులకు అర్హత కల్పిస్తున్నారు. దాదాపు 50 ప్రముఖ కంపెనీలు కెరీర్ ఫెయిర్‌లో పాల్గొంటున్నాయి. ఈ నేపథ్యంలో దీని కోసం గీతం విశ్వవిద్యాలయంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్న వివరాలను గీతంలోని ఇంటర్వ్యూ విభాగాలలో చూపించి ప్రవేశానికి అనుమతి పొందాల్సి ఉంటుంది. కెరీర్ ఫెయిర్‌లో పాల్గొనే యువత ఆధార్ లేదా ఏదైనా గుర్తింపుకార్డుతోపాటు తమ విద్యార్హతల ధ్రువీకరణలతో రావాలని నిర్వాహకులు కోరుతున్నారు. కెరీర్ ఫెయిర్‌ను సద్వినియోగం చేసుకోవాలని గీతం అధ్యక్షుడు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ సూచించారు.

28న బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- విశాఖ లీగల్ రిపోర్టర్ : విశాఖపట్నం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు ఈనెల 28న నిర్వహించనున్నట్లు విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బెవర సత్యనారాయణ, దంతా నరేష్ కుమార్ తెలిపారు. మంగళవారం దీనికి సంబంధించిన సర్కులర్‌ను కార్యదర్శి నరేష్‌కుమార్ విడుదల చేశారు. రెండు మూడు రోజుల్లో ఎన్నికల అధికారిని నియమించి, ఆయన ద్వారా ఎన్నికల షెడ్యూల్ వెల్లడిస్తామన్నారు

కాగా విశాఖ న్యాయవాదుల ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదల కాకముందే, అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కోశాధికారి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ తదితర పదవులకు పోటీకి ఆసక్తి ఉన్న అభ్యర్థులు నెలరోజుల నుంచి ప్రచారాలు చేస్తున్నారు. మంగళవారం ఎన్నికల తేదీని కూడా ప్రకటించడంతో కోర్టు పరిసరాల్లో న్యాయవాదులకు కలుస్తూ, పెద్దసంఖ్యలో ప్రచారాలు కొనసాగాయి. ప్రస్తుత కార్యవర్గం గడువు వచ్చేనెల 10 వరకు ఉన్నప్పటికీ, ఈనెలాఖరులోగా ఎన్నికల ప్రక్రియను పూర్తిచేసి, నూతన కార్యవర్గానికి బాధ్యతలు అప్పగించే యోచనలో ప్రస్తుత కమిటీ ఉంది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈ ఎన్నిక నిర్వహిస్తున్నారు.

నేరాలు ఘోరాలు

విశాఖలో నకిలీ పోలీస్ అరెస్ట్

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : పోలీస్‌గా చలామణి అవుతూ మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని ఎంవిపి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఎంవిపి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈస్ట్ ఎసిపి అన్నెపు నరసింహమూర్తి మాట్లాడుతూ, వివిధ కేసుల్లో పోలీసులు సీజ్ చేసిన వాహనాలను ఇప్పిస్తానని ప్రజలను మోసం చేసిన లోచన్ కుమార్‌ను బాజీ జంక్షన్ లో అరెస్ట్ చేసామని తెలిపారు. లోచన్‌కుమార్‌పై గతంలో గోపాలపట్నం, ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. గతంలో పోలీసు అధికారులతో తీసుకున్న ఫొటోలు, పేపర్ క్లిప్పింగ్‌లు చూపించి ప్రజల దగ్గర డబ్బులు వసూలు చేశాడని, పోలీస్ సెజ్డ్ వాహనాలు ఇప్పిస్తామని నమ్మించి సుమారు రూ.69 వేలు వసూలు చేశాడని వాటిని రికవరీ చేశామని తెలిపారు. ప్రజలంతా అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎంవిపి పోలీస్ స్టేషన్ సిఐ జె.మురళి, ఎస్‌ఐ ధనుంజయనాయుడు పాల్గొన్నారు.

కత్తితో దాడి చేసిన భర్తకు రిమాండ్

ప్రజాశక్తి -ములగాడ : భార్యపై అనుమానంతో కత్తితో భర్త దాడి చేసిన ఘటన మల్కాపురం దుర్గానగర్ గ్రామంలో చోటుచేసుకుంది. మల్కాపురం పోలీసులు, సిఐ ఎస్.విద్యాసాగర్ తెలిపిన వివరాలివి. మల్కాపురం దుర్గానగర్‌కు చెందిన భార్యాభర్తలు మురళి, సరస్వతి ఏడాదిగా విభేదాలతో వేర్వేరుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి సరస్వతి ఇంటికి వచ్చిన ఆమె భర్త వాగ్వాదానికి దిగాడని, ఈ క్రమంలోనే కత్తితో దాడి చేశారని బాధితురాలు మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్త దాడిలో గాయపడిన బాధితురాలిని స్థానికులు సమీపంలోని సెయింట్‌ఆన్స్ ఆసుపత్రిలో చేర్పించి, పోలీసులకు సమాచారమిచ్చారు. దీనిపై వివరాలు సేకరించిన పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. భార్యపై దాడి చేసిన భర్త మురళికి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

హామీల అమలుకు ఆటో కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - సీతమ్మధార :ఆటో డ్రైవర్స్, మోటార్ కార్మికులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎపి ఆటోడ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను అమలు కోరుతూ మంగళవారం రామాటాకీస్ జంక్షన్ వద్ద ఆటో కార్మికులు నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు పిఎఫ్, ఇఎస్ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు చేయాలన్నారు. ఎన్నికలకు ముందు సిఎం చంద్రబాబు ఇచ్చిన వాగ్దానం మేరకు జిఒలు 21, 31 రద్దు చేయాలన్నారు. వాహనమిత్ర సాయం రూ.15వేలు చెల్లించాలన్నారు. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్ టాక్స్, గ్రీన్ టాక్స్, లేబర్ టాక్స్, టోల్‌ప్లాజా ఫీజులను 30 శాతానికి తగ్గిస్తామన్న హామీ అధికారంలోకి వచ్చి 9నెలలైనా అమలు చేయలేదన్నారు. డ్రైవర్లకు వ్యక్తిగత రూ.పది లక్షల ప్రమాదబీమా పాలసీ ఇవ్వాలన్నారు. ఆటో కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుత శాసనసభ సమావేశాల్లోనే వీటిపై చర్చించి, అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో యు శివాజీ, రావి కృష్ణ, దేవుడు, ఈశ్వర్, ఎస్.అప్పలరాజు, టి.రవి పాల్గొన్నారు.

439 మందికి వైకల్య నిర్ధారణ పరీక్షలు

వైకల్య నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -పద్మనాభం: శారీరక వైకల్యంతో సామాజిక పింఛన్లు పొందుతున్న లబ్దిదారులకు వైకల్య నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మండలం లోని 21 గ్రామపంచాయతీ పరిధిలోని 439 మంది ఆర్థోపెడిక్ పింఛను దారులకు మంగళవారం భీమునిపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో వైకల్య నిర్ధారణ, వెరిఫికేషన్ పరీక్షలు చేస్తున్నట్లు ఎంపిడిఒ ఎం.విజయకుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛనుదారులంతా వైద్యపరీక్షలకు విధిగా హాజరు కావాలని సూచించారు.

నేడు మున్సిపల్ కార్మికుల ధర్నా

సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న రాజు

ప్రజాశక్తి-గాజువాక : మున్సిపల్ కార్మికులను ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఈనెల 5న విజయవాడ అలంకార్ సెంటర్ ధర్నా చౌక్‌లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు యు.రాజు డిమాండ్ చేశారు. మంగళవారం గాజువాక జోనల్ కార్యాలయంలో మున్సిపల్ కార్మికులతో సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో 123 మున్సిపాల్టీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య, యుజిడి, వాటర్ సప్లై, ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన 48 వేల మంది కార్మికులను ఆప్కాస్ నుండి తొలగించి ప్రైవేట్‌ఏజెన్సీలకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఆందోళన చేస్తున్నట్లు వెల్లడించారు. పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేసి, ఇతర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ముద్దాడ ప్రసాద్, జెఆర్. నాయుడు, శీర రమణ పాల్గొన్నారు.

మహేష్ మరణం తీరనిలోటు

సంతాపసభలో మాట్లాడుతున్న విభాగాధిపతి

ప్రజాశక్తి -ఉక్కునగరం : విశాఖ ఉక్కు కర్మాగారం ఎంఎంఎస్ఎం విభాగంలో జనరల్ ఫోర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ, అనారోగ్యంతో హఠాన్మరణం పొందిన ఆర్. మహేశ్వరరావు లేని లోటు పూడ్చలేనిదని స్టీల్‌ప్లాంట్ ఎంఎంఎస్ఎం విభాగాధిపతి సైబాల్ సేన్ అన్నారు .మంగళవారం విభాగంలోని క్యాసెట్ ప్రిపరేషన్ సెక్షన్‌లో మహేశ్వరరావు మృతికి సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా సైబాల్ సేన్ మాట్లాడుతూ విధి నిర్వహణలో మహేష్ అంకిత భావంతో పని చేసేవారన్నారు. కార్యక్రమంలో ఆపరేషన్ హెడ్ కృష్ణప్రసాద్, అధికారులు ఎండి. భోయర్, సిపి.నాయుడు, డి.శివప్రసాద్, కెవిఎన్.మూర్తి, ఎఐటియుసి కార్యదర్శి డి.దేముడు మాట్లాడారు. ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఫోక్సో కోర్టు పిపిగా రాజశేఖర్



బత్తి రాజశేఖర్

ప్రజాశక్తి- విశాఖ లీగల్ రిపోర్టర్ : బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం ద్వారా ఏర్పడిన ఫోక్సో కోర్టుకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది బత్తి రాజశేఖర్ నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం జిఒ విడుదల చేసింది. మూడేళ్ళ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప్రభుత్వం తరపున బాధితులకు ఆయన సేవలందించనున్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ న్యాయవిభాగం విశాఖ జిల్లా అధ్యక్షులుగా వ్యవహరిస్తున్న రాజశేఖర్, తన సేవలను గుర్తించి పిపిగా బాధ్యతలు అప్పగించడంపై సిఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రాజశేఖర్ నియామకం పట్ల విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బెవర సత్యనారాయణ, దంత నరేష్ కుమార్, బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఎస్ కృష్ణమోహన్, సభ్యులు రామ జోగేశ్వరరావు, పి నర్సింగరావు, బైపా అరుణ్ కుమార్, టిడిపి న్యాయ విభాగం రాష్ట్ర నాయకులు శోభన్‌బాబు తదితరులు అభినందనలు తెలిపారు.

నిర్వహణ లేమితో అందని సాగునీరు

పాండ్రంగి దివాన్జీ కాలువ నీటి సంఘం చైర్మన్ రవిబాబు

పూడుకుపోయిన కాలువను చూపుతున్న రవిబాబు

ప్రజాశక్తి -పద్మనాభం :సాగునీటి ఆనకట్టలు, పంటకాలువలకు ఏళ్లతరబడి నిర్వహణ, మరమ్మతులు లేకపోవడంతో ఆయకట్టు భూములకు సాగునీరు అందని పరిస్థితి ఉందని మండలంలోని పాండ్రంగి దివాన్జీ కాలువ నీటిసంఘం చైర్మన్ రాజాసాగి రవిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. దివాన్జీ కాలువతో పాటు గోస్తని నదిలో మద్దిలో నిర్మించిన ఆనకట్టు మరమ్మతులు చేయకపోవడంతో దీనావస్థలో ఉందని వాపోయారు. మంగళవారం పాండ్రంగి దివాన్జీ కాలువను సందర్శించి, పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాండ్రంగి దివాన్జీ పంటకాలువ ద్వారా 15 కిలోమీటర్ల దూరాన పాండ్రంగి చిరత చెరువు, కాటమయ్య చెరువు,గొట్టుపల్లి సమీపంలోని సన్నపచెరువు, తాటిపూడి గ్రామానికి సమీపంలో ఉన్న నందచెరువులకు ఖరీఫ్‌లో సాగునీరు చేరుతుందని అలా చేరిన నీటిని నిల్వ ఉంచుకోవడం ద్వారా వీటి పరిధిలోని 1375 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందాల్సి ఉందన్నారు. అయితే ఏళ్లతరబడి ఆయా కాలువలు, చెరువుల మరమ్మతులు లేకపోవడంతో పూడికలు పేరుకుపోయి, మద్ది వద్ద ఆనకట్ట మరమ్మతులు లేక సాగునీరు చేరని పరిస్థితి ఉందన్నారు. మూడు నెలల క్రితం నీటి సంఘం ఎన్నికలు జరిగి, కమిటీలను ఎన్నుకోగా, ఇంతవరకు ఆయా సాగునీటి వనరుల అభివృద్ధి, నిర్వహణపై కనీసం సమీక్ష జరపని పరిస్థితి ఉందని రవిబాబు వాపోయాడు. నీటిపారుదల శాఖ ఎఇ నళిని, సంబంధిత శాఖ అధికారులు ఇప్పటివరకు సమస్యలపై ప్రస్తావించిన దాఖలాలు లేవన్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, సాగునీటి వనరుల నిర్వహణ, మరమ్మతులపై దృష్టిపెట్టాలని, ప్రభుత్వపరంగా ప్రజాస్వామ్యయుతంగా ఎన్నుకోబడిన నీటి సంఘాలతో సమీక్షించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.

అచ్చెన్న వ్యాఖ్యలు ఉపసంహరించు కోవాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మంత్రి అచ్చెనాయుడు యుటిఎఫ్‌కు వైసిపి ముసుగువేస్తూ చేసిన వ్యాఖ్యలను యుటిఎఫ్ విశాఖపట్నం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్. అంబేద్కర్ తీవ్రంగా ఖండించారు. యుటిఎఫ్‌కు వైసిపి ముసుగేయడం సరికాదని, వాస్తవానికి ఎపిటిఎఫ్, పిఆర్‌టియు అభ్యర్థులకు కూటమి పక్షాలే తమ పార్టీల ముసుగులేసి ఉపాధ్యాయ ఉద్యమంలో చీలికలు తెచ్చారని విమర్శించారు. కూటమి బహిరంగంగా మద్దతు పలికిన అభ్యర్థి ఓటమి చెందడం, వారు విద్యారంగంలో అనుసరిస్తున్న విధానాలకు చెంపపెట్టు అని ఇప్పటికైనా గ్రహించాలని కోరారు. ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ స్వతంత్రంగా పోటీ చేసిందని, దానికి యుటిఎఫ్, ఉపాధ్యాయ, అధ్యాపక, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయని గుర్తు చేశారు. యుటిఎఫ్ విద్యా, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తుందే తప్ప, ఏ పార్టీకి అనుకూలంగా, ప్రతికూలంగా ఉండదన్నారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలను రాజకీయ కోణంలో చూస్తూ, యుటిఎఫ్‌ను అలాగే చూడడం సరికాదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన యుటిఎఫ్ స్థైర్యం తగ్గిపోలేదన్నారు. గత ప్రభుత్వ విద్యా వినాశకర విధానాలనే కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోందని,వాటిని వ్యతిరేకిస్తూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు.

కుమారుడి కళ్లను దానం చేసిన తల్లిదండ్రులు

మృతుని కుటుంబీకులకు సర్టిఫికెట్ ఇస్తున్న డాక్టర్ వాణి

ప్రజాశక్తి- గోపాలపట్నం : పుట్టెడు దుఃఖంలోనూ మరణించిన కుమారుడి నేత్రాలను దానం చేసి ఆ తల్లిదండ్రులు ఆదర్శంగా నిలిచారు. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం కప్పరాం గ్రామానికి చెందిన గోకా శివకృష్ణ(34) జివిఎంసి 91వ వార్డు లక్ష్మీనగర్ ఇ-బ్లాక్‌లో తల్లిదండ్రులు గోక సోమేష్, దమయంతిలతో కలిసి నివాసముంటున్నాడు. శివకృష్ణ సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడి నేత్రాలు మట్టి పాలు కాకుండా నేత్రదానం చేయాలని కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. మోహిసిన్ కంటి బ్యాంకుకు శివకృష్ణ కళ్లను దానం చేయడంతో వారు వచ్చి వాటిని సేకరించారు. శివకృష్ణ కుటుంబ సభ్యులకు డాక్టర్ వాణి నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. తీవ్ర విషాదంలోనూ కొడుకు కళ్లను దానం చేసిన మృతుని కుటుంబసభ్యులు గొప్పతనాన్ని పలువురు ప్రశంసించారు.

ఇటుక బట్టీల కాలుష్యంతో పరేషాన్

ప్రజాశక్తి -ఆనందపురం :మండలంలోని బోని గ్రామానికి ఆనుకొని ఉన్న ఇటుక బట్టీల కాలుష్యంతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాపారమే ధ్యేయంగా ఇటుకల తయారీ, వ్యాపారం చేస్తున్న నిర్వాహకులు, కాలుష్య నివారణకు సరైన చర్యలు చేపట్టడం లేదు. బోని గ్రామానికి ఆనుకుని 20 ఇటుక బట్టీలు ఉన్నాయి. నిత్యం ఇటుకలు తయారు చేసే క్రమంలో బొగ్గు, రంపపు పొట్టుతో ఇటుకలను కాలుస్తుండడంతో వాటినుంచి వెలువడే నల్లని ఘాటైన పొగ, ధూళితో స్థానికులు శ్వాసకోశ, కంటి సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇటుక తయారీకి విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడంతో, పుట్టగొడుగుల్లా వెలిసిన ఇటుక బట్టీల నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే కాలుష్యం కమ్మేస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై కాలుష్య నియంత్రణ మండలితోపాటు సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని వాతావరణ కాలుష్యాన్ని అరికట్టాలని కోరుతున్నారు.

ఇటుక బట్టీల పొగతో కమ్ముకున్న కాలుష్యం

మహిళా దినోత్సవ ‘ప్రజాశక్తి’ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తున్న ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపల్ పద్మశ్రీ

ప్రజాశక్తి- విశాఖపట్నం : ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాశక్తి ముద్రించిన మహిళా దినోత్సవ ప్రత్యేక సంచిక ‘సమత’ను మంగళవారం ఆంధ్రా యూనివర్సిటీ ఉమెన్స్ కాలేజీలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్.పద్మశ్రీ ఆధ్వర్యంలో అధ్యాపకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. ప్రజ్ఞ, ఐసిఇ విభాగాధిపతి డాక్టర్ ఎస్.అరుణ, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి.శిరీష్, కాలేజీ విద్యార్థినులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన రాజబాబు

చంద్రబాబుతో రాజబాబు

ప్రజాశక్తి - ఆనందపురం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భీమిలి నియోజకవర్గ సమస్యలను విన్నవించారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తానని హామీ ఇచ్చారని రాజబాబు తెలిపారు.

విద్యుత్ లైన్‌మెన్లకు జాతీయ అవార్డులు

ప్రజాశక్తి- సీతమ్మధార : అత్యుత్తమ పనితీరు కనబరిచి, అల్లూరి జిల్లా చింతూరు లైన్ ఇన్‌స్పెక్టర్ కె.గణేష్ జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డు సాధించారని ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. మంగళవారం ఢిల్లీలో లైన్‌మెన్ దివస్‌లో సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ చైర్మన్ ఘనశ్యామ్ నుంచి గణేష్ అవార్డు స్వీకరించారన్నారు. అలాగే ఉత్తమ లైన్‌మెన్లుగా ప్రశంసలు పొందిన అనకాపల్లి సర్కిల్‌కు చెందిన బి.మాణిక్యాలరావు, పార్వతీపురం సర్కిల్‌కు చెందిన పి.సింహాచలానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా పృథ్వీతేజ్ మాట్లాడుతూ, వ్యవసాయ, వాణిజ్య, పరిశ్రమ, గృహ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం శ్రమిస్తున్న లైన్‌మెన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్ల సేవలను గుర్తించి, కేంద్ర విద్యుత్‌మంత్రిత్వశాఖకు చెందిన సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఏటా మార్చి 4న ‘థాంక్ ఎ లైన్‌మెన్’ పేరిట లైన్‌మెన్ దివస్‌ను నిర్వహిస్తోందన్నారు. ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో లైన్‌మెన్ దివస్‌ను నిర్వహించామన్నారు. ఉత్తమ లైన్‌మెన్లకు సిఎండి పృథ్వీతేజ్‌తోపాటు సంస్థ డైరెక్టర్లు డి.చంద్రం, వి.విజయలలిత, బి.రామచంద్ర ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు.

దంత ఆరోగ్యంపై విదేశీ విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- మధురవాడ: గీతం దంత వైద్య కళాశాల ఆసుపత్రి ఆధ్వర్యంలో విదేశీ విద్యార్థులకు నోటి ఆరోగ్యం, దంత సంరక్షణపై మంగళవారంప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దంత సంరక్షణలో యువత అప్రమత్తంగా ఉండాలని, పండ్ల చిగుళ్ల వ్యాధులకు కారణమయ్యే ఫాస్ట్‌ఫుడ్‌లు, శీతల పానీయాలకు అతిగా అలవాటు పడకూడదని సూచించారు. పెరియోడాంటిక్స్ విభాగం అధిపతి డాక్టర్ త్రినాద్ కిషోర్ మాట్లాడుతూ, గీతం దంత వైద్య కళాశాల, ఆసుపత్రిలో అధునాతన దంత వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వాటిని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో దంత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.నరసింహారావు, దంత వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల ముసుగులో గ్రావెల్ దందా

- వియంఆర్‌డిఎ నుండి అనుమతులున్నాయంటూ బుకాయింపు
- తాము పర్మిషన్ ఇవ్వలేదంటున్న తహశీల్దారు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామంలో జగనన్న అర్బన్ హౌసింగ్ లే అవుట్లకు మట్టి తరలింపు ముసుగులో గ్రావెల్ అక్రమ దందా కొనసాగుతోంది. గ్రామానికి చెందిన కొందరు నాయకులు కొండలు తవ్వి గ్రావెల్‌ను అమ్ముకొని జేబులు నింపుకుంటున్నారు. ఈ విషయమై అదే గ్రామానికి చెందిన కొందరు స్థానిక విలేకరులకు సమాచారం అందించడంతో పాత్రికేయులు మంగళవారం అక్కడకు చేరుకొని విషయాన్ని ఆరా తీశారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఈ పంచాయతీలో జగనన్న అర్బన్ హౌసింగ్ కాలనీలు ఏర్పాటు చేయడానికి నిర్మాణానికి అవసరమైన గ్రావెల్ కోసం వియంఆర్‌డిఏ మూడు జెసిబిలు, సుమారు 10 లారీలకు అనుమతులు జారీ చేసినట్లు గ్రావెల్ తరలిస్తున్న వారు తెలిపారు. తహసీల్దార్, మైనింగ్ అధికారులకు రాసిన పత్రం పట్టుకొని, తమకు అనుమతులు ఉన్నాయని గ్రావెల్ అక్రమ దందాదారులు పాత్రికేయులను బురిడీ కొట్టించే ప్రయత్నం చేశారు. అయితే గ్రావెల్ ఎక్కడ నుండి తవ్వాలి, ఏ కొండ నుండి ఏ ప్రాంతం నుంచి తవ్వాలి, ఎంత లోతు తవ్వాలి అన్న విషయాలపై పూర్తి సమాచారం లేకపోవడాన్ని గుర్తించారు. మరో వైపు స్థానికులు కొందరు ఇదే అదునుగా కొండలను సుమారు 20 అడుగుల లోతు వరకు తవ్వి గ్రావెల్‌ను తమ సొంత పనులకు ఉపయోగిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై స్థానిక తహశీల్దారును విలేకరులు వివరణ కోరగా గతంలో వైసిపి ప్రభుత్వం సమయంలో జగనన్న అర్బన్ హౌసింగ్ కాలనీల ఆర్‌సి ప్లాట్లు అభివృద్ధికి గ్రావెల్ కోసం మైనింగ్ అధికారులకు అనుమతుల కోసం లేఖ రాసినట్లు స్పష్టం చేశారు. అయితే తాము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.

కొండ తవ్వేసి గ్రావెల్ తరలించిన దృశ్యం

ఒప్పంద పత్రాలు చూపుతున్న అధికారులు

పిఠాపురం అభివృద్ధికి ఎన్‌టిపిసి సిఎస్ఆర్ నిధులు

ప్రజాశక్తి-పరవాడ : పిఠాపురం నియోజకవర్గంలో కీలకమైన కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల అమలుకు కాకినాడ జిల్లా కలెక్టర్‌తో ఎన్‌టీపీసీ సింహాద్రి ఒప్పందం చేసుకుంది. ఎన్టీపిసి వ్యూహాత్మక సిఎస్ఆర్ కార్యక్రమాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అభ్యర్థన మేరకు చేపట్టిన ఈ ఒప్పందం చేసుకుంది. ఈ ప్రాంతంలో పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హెల్త్‌కేర్, విద్యను మెరుగుపరచడం లక్ష్యంగా సింహాద్రి ప్రాజెక్ట్ హెడ్- సమీర్ శర్మ, కాకినాడ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, సీనియర్ ఎన్టీపీసీ అధికారులతో కలిసి సంతకం చేశారు. రూ.2.85 కోట్ల యుపిహెచ్‌సి గొల్లప్రోలు నగర పంచాయతీలో పనులు పూర్తి చేయడానికి నిధులు సమకూర్చనుంది. గొల్లప్రోలు మండలంలో సీసీ రోడ్లు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు పిఠాపురంలోని సిహెచ్‌సి వద్ద ఆక్సిజన్ ప్లాంట్, యు.కొత్తపల్లిలో ఒక కమ్యూనిటీ హాల్, యు కొత్తపల్లి పిహెచ్‌సిలో ఔట్ పేషెంట్ బ్లాక్, ప్రజారోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను అప్‌గ్రేడ్ చేయడం, రోడ్ల నిర్మించడం, పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం, తరగతి గది ఫర్నిచర్ అందించడం, కమ్యూనిటీ స్థలాలను నిర్మించడం వంటి కార్యక్రమాలు చేపడతామని ఎన్‌టిపిసి అధికారులు తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఐసిడిఎస్ సిడిపిఓ మంగతాయారు అన్నారు. ఆరోగ్యవంతమైన మహిళలు సుఖ శాంతి జీవితంపై అంగన్వాడీ కార్యకర్తలకు మంగళవారం యోగా క్లాసులు నిర్వహించారు. వివిధ రకాల యోగ ప్రక్రియలను నేర్పించారు. ఈ సందర్భంగా మంగతాయారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ప్రధాని మోడీ ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఈ సందర్భంగా పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు ఎల్‌బి సుశీల, ఎస్ కళ్యాణి, రాములమ్మ, ఆదిలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు భూపతి లక్ష్మి, డోకల కుమారి, డోకల రమ, గాలి గౌతమి, మహిళా పోలీస్ పాల్గొన్నారు.

లైంగిక వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలి

ప్రజాశక్తి-యలమంచిలి : లైంగిక వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ అన్నారు. స్థానిక గురజాడ డిగ్రీ కాలేజీలో పోక్సో చట్టంపై మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. వక్తిత్వం రూపొందుతున్న తరుణంలో మరీ ముఖ్యంగా విద్యార్థి దశలో తెలిసీ తెలియని వయసులో బాలికలు సెక్సువల్ మోసాలకు ఎక్కువగా గురవుతున్నారని తెలిపారు. అటువంటి వాటి నుండి బాలికల రక్షణ కోసం రూపొందిన చట్టమే ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ (పోక్సో) చట్టం అని తెలిపారు. ఇంటర్నెట్ అందరికీ అందుబాటులోకి వచ్చిందని, సెక్సువల్ ఎబ్యూజ్‌మెంటు అదే స్థాయిలో పెరిగిందని చెప్పారు. మెసేజ్‌లతో పాటు వివిధ రూపాల్లో వేధింపులు జరుగుతున్నాయని, వాటిని విద్యార్థి దశలోనే ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. చట్టాలు, కోర్టులు, పోలీసులు బాధితులకు రక్షణ కల్పిస్తాయని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి.నూకరాజు, టౌన్ ఎస్ఐ సావిత్రి, పానెల్ లాయర్లు, ద్వారపురెడ్డి, కోర్టు సిబ్బంది, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

8 నుండి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్.ఎ.ఎమ్.పి. పథకం ద్వారా మార్చి 8వ తేదీ నుండి ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు జి.నాగరాజారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎంఇ, ఎపిఎంఎస్ఎంఇ అభివృద్ధి సంస్థ వారి ద్వారా గుర్తింపు పొందిన శిక్షణ సంస్థ ట్రెండ్ ఐటి వారిచే ఈ శిక్షణ నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇస్తామన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించుటకు అవసరమైన అవగాహన, ప్రాజెక్ట్ ప్రిపరేషన్, పథకాల వివరాలు, మార్కెట్‌పై అవగాహన వస్తుందని చెప్పారు. ఈ శిక్షణ తరగతులు అనకాపల్లిలో ట్రెండ్ ఐటి, 12-46 మార్క్స్ షాపింగ్ మాల్ పైన, 3వ ఫ్లోర్, ఉషాప్రైమ్ పక్కన, కాంప్లెక్స్ దగ్గర, చోడవరంలో ట్రెండ్ ఐటి, 5-20, లక్ష్మీపురం రోడ్, వేంకటేశ్వరస్వామి గుడి ఎదురుగా తదితర కేంద్రాలలో మార్చి 8వ తేదీ నుండి ఈ శిక్షణ నిర్వహించబడుతుందని తెలిపారు. అనకాపల్లి సెంటరుకు సంబంధించి 9502166626, 9948519782 నెంబర్లలోనూ, చోడవరం సెంటరుకు సంబంధించి 7386084548, 7799883952 నెంబర్లలోనూ సంప్రదించాలని కోరారు. ఈ ఉచిత శిక్షణకు హాజరు కాదలచిన 18 నుండి 58 సంవత్సరాలు వయస్సు కలిగి, ఆధార్ కార్డ్, పాస్ పోర్ట్ సైజు ఫోటోలు, కులధ్రువీకరణ పత్రం, తెల్లరేషన్ కార్డు తీసుకొని మార్చి 5వ తేదీనుండి సంప్రదించాలని సూచించారు.

మార్చురీకి నూతన భవనం నిర్మించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా వైద్యాలయంలో మార్చురీకి అదనపు ఫ్రీజర్ ఏర్పాటు చేయాలని, నూతన భవనం నిర్మించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వేదిక నాయకులు బొట్ట చిన్ని యాదవ్, బొడ్డేడ అప్పారావు, చిన్న అప్పారావు, కట్టమూరు మంగరాజు, ఆడారి బుచ్చి రాము, వాసుపల్లి తాతయ్యలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 13,709 మంది హాజరు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు జిల్లాలో 34 కేంద్రాల్లో జరుగుతునట్లు ఇంటర్మీడియట్ ప్రాంతీయ అధికారి సుజాత తెలిపారు. మంగళవారం జరిగిన పరీక్షలకు మొత్తం 14,249 మందికి 13,709 మంది హాజరుకాగా 540మంది గైర్హాజరైనట్లు చెప్పారు.

రోడ్డు విస్తరణ సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-మునగపాక

అనకాపల్లి- అచ్యుతాపురం రహదారి విస్తరణ సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. మండలంలోని నాగులపల్లి బైపాస్ వద్ద మంగళవారం రెవిన్యూ, ఆర్ అండ్ బి, వియంఆర్‌డిఏ శాఖల ఆధ్వర్యంలో రహదారి విస్తరణ పనులలో భాగంగా జరుగుతున్న సర్వే పనులను ఆమె పరిశీలించారు. మూడు శాఖల అధికారులు త్వరితగతిన సర్వేలను పూర్తి చేయాలన్నారు. నిర్వాసితులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో సర్వే చేయాలని సూచించారు. విస్తరణలో భూములు, ఇల్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వం న్యాయం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అనకాపల్లి ఆర్డీవో ఆయేషా బేగం, ల్యాండ్ అండ్ రికార్డ్స్ విభాగం ఏడి గోపాలకృష్ణ, వియంఆర్‌డిఏ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

సాల్వియాస్ ఫార్మా పరిశ్రమను తెరిపించాలి

లేబర్ కమిషనర్‌కు సిఐటియు ఆధ్వర్యాన వినతి

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాము

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎస్ఇజెడ్‌లోని సాల్వియాస్ ఫార్మా పరిశ్రమ కార్మికులకు ఇవ్వవలసిన మూడు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని, పరిశ్రమను తెరిపించాలని లేబర్ కమిషనర్‌కి మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమ అర్ధాంతరంగా మూసివేయడంతో 60 మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా చట్ట వ్యతిరేకంగా కంపెనీ మూసివేయడం అన్యాయమన్నారు. కార్మికులకు రావాల్సిన మూడు నెలలు బకాయి జీతాలు, చట్ట ప్రకారం రావలసిన అన్ని బకాయిలు ఇవ్వాలని ప్రభుత్వం, లేబర్ అధికారులు స్పందించి పరిశ్రమను తెరిపించి ఉపాధి కల్పించాలని కోరారు. అన్యాయంగా వ్యవహరిస్తున్న పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగేష్, హరి, కార్మికులు పాల్గొన్నారు.

పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా చూడాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : పిల్లలపై లైంగిక వేధింపులు, దాడులు జరగకుండా వారిని జాగ్రత్తగా చూసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.రవికుమార్ అన్నారు. మంగళవారం వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో పిల్లలపై లైంగిక వేధింపులు నివారించాలనే అంశంపై ఒక్క రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా చూసుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. లైంగిక దాడులకు పాల్పడిన వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు. లైంగిక వేధింపులపై పిల్లలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని, అపరిచితులతో జాగ్రత్తగా మసలుకొనేటట్లు తెలియజేయాలని సూచించారు. ఎన్‌సిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జె.ప్రశాంతి మాట్లాడుతూ పిల్లలకు గుడ్ టచ్- బేడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర స్థాయి ట్రైనర్ ఉదయ్ కుమార్, సైకాలజిస్ట్ బి.నాగరాజు మాట్లాడుతూ గతంలో ఉమ్మడి కుటుంబాలు వుండేవని, నేడు స్వతంత్ర కుటుంబాలుగా జీవించుట వలన పిల్లల మానసిక ఎదుగుదలకు సరైన విషయాలు భోదించేవారు లేకపోతున్నారని తెలిపారు. పిల్లలకు ఏది మంచో ఏది చెడో ఉపాధ్యాయులు కూడా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఎంఇఒలు, సిడిపిఒలు, గవర్నమెంట్ మెంటల్ హెల్త్ హాస్పిటల్ సిబ్బంది, సైకియాట్రిస్ట్ డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్ వెన్షన్ పిడియాట్రిషియన్, మెడికల్ ఆఫీసర్, డిఈఐసి మేనేజర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ రవికుమార్

విశ్వబ్రాహ్మణ సంఘం మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-వడ్డాది

విశ్వబ్రాహ్మణ సంఘం మండల కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. పంచ వృత్తుల సంక్షేమ సొసైటీ జిల్లా కార్యవర్గం ఆదేశాల మేరకు మండలంలోని రాజాం గ్రామ మరిడిమాంబ ఆలయం వద్ద మండల కార్యవర్గం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అతిథులుగా చుక్కా వెంకట సత్తిరాజు, కో కన్వీనర్. పెదపూడి ప్రసాద్ హాజరయ్యారు. గ్రామ సంఘాల సభ్యుల సమక్షంలో కొత్తగా మండల కమిటీని ఎన్నుకున్నారు. సంఘం మండల గౌరవ అధ్యక్షులుగా భీమవరపు శ్రీను, మండల సలహా సభ్యులుగా పంతం రామారావు, కన్వీనర్‌గా కడియం శ్రీనివాస్, కో కన్వీనర్‌గా ఎండపల్లి తులసీరావు, ఉపాధ్యక్షులుగా చుక్కా ఆచారి, ఎండపల్లి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా చుక్కా లక్ష్మణరావు, సహాయ కార్యదర్శిగా పోలుమూరి ఆనంద, కోశాధికారిగా పాలవలస భాస్కరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమాశంలో వడ్డాది, బుచ్చయ్యపేట, తురకలపూడి, దిబ్బిడి, కరక, బంగారు మెట్ట, పెద్ద మదిన, గొల్లపాలెం, విజయ రామరాజుపేట, చిట్టియపాలెం, గున్నెంపూడి, రాజాం, గొర్లెపాలెం, పెదపూడి అగ్రహారం, గంటి కొర్లం, కోయిల పిల్లి తదితర గ్రామ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నూతన మోటారు యాక్టును రద్దుచేయాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : నూతన మోటారు యాక్టు 106(1)(2)ను వెంటనే రద్దు చేయాలని ఏపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. మండలంలోని వడ్డాది జంక్షన్ సినిమా హాలు వద్ద శ్రీదేవి ఆటోసంఘం కార్మికులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలు లేక స్వయం ఉపాధి పథకం కింద, ప్రైవేటు ఫైనాన్స్ నుండి అప్పులు తీసుకొని ఆటోలు కొనుగోలు చేసి మారుమూల గ్రామాల నుండి పట్టణ ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని, ప్రభుత్వాలకు కోట్ల రూపాయలు పన్నులు చెల్లిస్తున్నారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంపై పునరాలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటియూసీ జిల్లా నాయకులు వాయిబోయిన శేఖర్, ఆటో కార్మికులు తోట నూకరాజు, కాసుల రమణ, సిరా మావుళ్ళు, సుంకర రాము, గణేష్, తాడి శ్రీను, తోట అప్పారావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-యలమంచిలి : మండలంలోని పులపర్తి హైస్కూల్లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మైహోం సిమెంట్ ఫ్యాక్టరీ సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో జెడ్‌పి హైస్కూల్లో చదువుతున్న పులపర్తి, కృష్ణాపురం, లక్కవరం, గూండ్రుబిల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు 325 మందిని పరీక్షించి వారికి అవసరమైన మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సాంబమూర్తి, డాక్టర్ మేఘన , డాక్టర్ నరేష్, ధనుంజయ్ వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ సీనియర్ జనరల్ మేనేజరు బి.రామస్వామి, సీనియర్ డిజిఎం శ్రీనివాసరావు, ఒహెచ్‌సి రాజు, సిఎస్‌ఓ డి.వెంకట్రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఎడ్ల పరుగు పందెం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కొత్తూరు ముత్యాలమ్మపాలెం గ్రామంలో మంగళవారం శ్రీఅభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మధ్యాహ్నం రెండు గంటల నుంచి జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీలో విజేతలకు భారీ నగదు బహుమతులు అందజేశారు. అనంతరం గ్రామంలో పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రైవాడ జలాశయం ఛైర్మన్ పోతల పాత్రునాయుడు, మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి శరభాన సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ గంధం జగ్గారావు, పెద్దడ వెంకటరమణ, సోమిరెడ్డి గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల పరుగు పందెం జరుగుతున్న దృశ్యం

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

అచ్యుతాపురంలో వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండలంలోని అచ్చుతాపురం, హరిపాలెం పిహెచ్‌సి వైద్యాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ కె. సోము నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న మాదిరిగా కనీస వేతనాలు, ఒప్పంద జీవోలను అమలు చేయాలని, ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకులు మంగమ్మ, దుర్గ, సరోజినీ, సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

6న విజయవాడ ధర్నాను జయప్రదం చేయాలి

చోడవరం : ఆశా వర్కర్ల సమస్యలపై ఈనెల ఆరో తేదీన విజయవాడలో జరుగు ధర్నాను విజయవంత చేయాలని ఆశ వర్కర్ యూనియన్ నాయకులు బి.రామలక్ష్మి కోరారు. ధర్నాను విజయవంత చేయాలని కోరుతూ చోడవరంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. అనంతరం గవరవరం పిహెచ్‌సి వైద్యాధికారికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కె.వరలక్ష్మి, ఎస్ లక్ష్మి, కే తార, సిఐటియు నాయకులు ప్రేమ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చోడవరం మండలం గంగవరంలో..

18న చలో విజయవాడను జయప్రదం చేయాలి

ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వరలక్ష్మి

ప్రజాశక్తి-చోడవరం

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలపై ఈనెల 18వ తేదీన జరుగు చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గునూరు వరలక్ష్మి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు రూ.3వేలు వేతనమిస్తూ వెట్టిచాకిరీ చేయించుకుంటుందని తెలిపారు. ఈ పథకం ప్రారంభించి 23 ఏళ్ల అవుతున్నా కార్మికుల జీతాల్లో మార్పులు లేదని, ధరలు పెరుగుతున్న వేతనాలు పెరగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. పిల్లలకు ఇస్తున్నటు వంటి మెనూ ఛార్జీలు పెంచడం లేదని, మెనూల మార్పుల పేరుతో కార్మికులపై అధిక భారాన్ని మోపుతున్నారని, కానీ డబ్బులు మాత్రం పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి మెనూ ఛార్జీలు, వేతనాలు పెంచాలని కోరారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా కార్మికులను అక్రమంగా తొలగిస్తున్నారని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వంగాని, అధికారులుగాని స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రమాదాలు జరుగుతున్నప్పుడు కనీసం ఇటువంటి ప్రమాద బీమా సౌకర్యాలు లేకపోవడం వల్ల చేతి చమురు వదిలించుకుంటూ వైద్యం చేయించుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు.

మహిళలు సమతుల్య ఆహారం తీసుకోవాలి

కశింకోట మండల అచ్చర్లలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు

ప్రజాశక్తి-యలమంచిలి

మహిళలు శారీరకంగా బలంగా, దృఢంగా ఉండడానికి సమతుల్య ఆహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రంజాన్ బీబీ అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా స్థానిక గరల్స్ హైస్కూల్లో న్యూట్రిషన్, యోగాపై అవగాహన శిబిరాలు నిర్వహించారు. రక్తహీనతతో ఎక్కువ శాతం మంది మహిళలు బాధపడుతున్నారని, వారు బలవర్ధకమైన ఆహారపదార్థాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా ప్రతినిధులు పద్మావతి, హైస్కూలు ప్రధానోపాధ్యాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలో అచ్చర్ల అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామస్తులు, గర్భిణులు, బాలింతలు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కమలదేవి, నాగ సత్య ఆశా, ఆయా, గ్రామస్తులు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని మునగపాక, గణపర్తి గ్రామాల జడ్పీహెచ్ స్కూళ్లలోనూ, చూచుకొండ పిహెచ్‌సి, పాటిపల్లి కస్తూరిబా పాఠశాలలో మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. కెజిబివిలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మీరాబీ ఆధ్వర్యాన న్యూట్రిషన్‌పై అవగాహన, యోగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఐసిడిఎస్ సూపర్వైజర్ అన్నపూర్ణ, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని ఎల్.సింగవరం, లోపూడి, బంగారు మెట్ట గ్రామాలలో ఐసిడిఎస్ పిఒ పుష్పదేవి సమావేశాలు నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రాజరాజేశ్వరి, అంగన్వాడి కార్యకర్తలు వెంకటలక్ష్మి, దుర్గ, జ్యోతి, నూకరత్నం. శివమ్మ, అమ్మాజీ పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండల కేంద్రంలో మంగళవారం "ఆరోగ్యకరమైన మహిళలు – సంతోషకరమైన జీవితం" అనే అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి సంధ్య రాణి, అంగన్వాడీ టీచర్ గాయత్రి, లీల తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా 'హ్యాపీ అవర్స్'

పరవాడ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా పరవాడ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం "హ్యాపీ అవర్స్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పోలీసు కుటుంబ సభ్యులు, జిఎంఎస్‌కెలు, పిల్లలు సహా సుమారు 50 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారికి వివిధ రకాల ఆటలు, మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్, నృత్యం, పాట పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అందరికీ అల్పాహారం ఏర్పాటు చేసి వేడుకను ఆనందంగా ముగించారు. కార్యక్రమంలో పరవాడ సిఐ ఆర్ మల్లికార్జున రావు, మహిళా ఎస్ఐ మహలక్ష్మి, నాయుడు, పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట సెయింట్ జాన్స్ పాఠశాలలో సిఐ స్వామి నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మనోజ్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పోలమాంబ పండగ మహోత్సవం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ఈ.బోనంగి ఫార్మా సిటీ కాలనీలో గ్రామం దేవత శ్రీపోలమాంబ అమ్మవారి పండగ మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమ చీర జాకెట్లతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన నాయకులు పంచకర్ల ప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్న, ఈ.బోనంగి సర్పంచ్ బొద్దపు శ్రీనివాస్, జనసేన నాయకులు బుగిడి రామగోవిందరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడిశెట్టి అప్పారావు, వెన్నెల నరసింగరావు, పంచకర్ల మణికంఠ, బొండా శ్రీనివాసరావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

దుర్గమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం

సబ్బవరం : మండలంలోని వెన్నెలపాలెం పంచాయతీ శివారు టి.జంగాలపాలెం గ్రామంలో శ్రీదుర్గమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం మంగళవారం జరిగింది. ఉదయం 5 గంటల నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుండి భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుండి స్వామి గరిడీలు, చిటికెల భజనలు, తీన్మార్ డప్పులు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో వైభవంగా తీర్థ మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ప్రసాద్, అనకాపల్లి సోంబాబు, అనకాపల్లి శ్రీనివాసరావు, అచ్యుతరావు, చిన సోంబాబు, అనకాపల్లి పైడిలింగం, అనకాపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

పరదేశమ్మ పండగ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-పరవాడ : మండలం తానాం గ్రామంలో ఈనెల 9 నుండి 11వ తేదీ వరకు జరుగు శ్రీ పరదేశమ్మ అమ్మవారి పండుగ మహోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను తానాం గ్రామంలో మంగళవారం అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కన్నూరు వెంకటరమణ, మాజీ జెడ్‌పిటిసి పైల జగన్నాథరావు, మాజీ సర్పంచ్ పైల రామారావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ పాల సొసైటీ అధ్యక్షులు గోరుపుటి కన్నం నాయుడు, వార్డ్ మెంబర్లు గోరుపోటి సన్యాసిరావు, రొంగలి అప్పారావు, రొంగలి సన్యాసిరావు, పైల జానకిరావు, వర్రి వెంకటరమణ, వర్రి పరదేశినాయుడు, బెల్లాల విశ్వేశ్వరరావు, గోరుపోటి ముత్యాలనాయుడు, పైల ఈశ్వరరావు, పైల వెంకటరావు, పైలా సతిబాబు, చీపురుపల్లి సన్యాసిరావు, పైల ముని, కె రవి తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబ జాతర గోడ పత్రిక ఆవిష్కరణ

పరవాడ : మండల కేంద్రం పరవాడలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో జరగబోవు గ్రామ దేవత శ్రీపైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవానికి సంబంధించి గోడ పత్రికను మంగళవారం స్థానిక పైడిమాంబ అమ్మవారి ఆలయం వద్ద స్థానిక నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, వైసిపి రాష్ట్ర సిఈసి సభ్యులు పైల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, టిడిపి నాయకులు పైల సన్యాసిరావు, ఉప సర్పంచ్ బండారు రామారావు, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, చల్లా కనకారావు, పైల రామచంద్రరావు, అయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోని శివాలయం నిర్మాణానికి సబ్బవరం మేజర్ పంచాయతీ చినగొల్లలపాలెం గ్రామానికి చెందిన గొంప వెంకునాయుడు రూ.50,116 విరాళాన్ని మంగళవారం ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో బర్ల రమణ, గెడ్డం కృష్ణ, పాల్గొన్నారు.

తాగునీటికి గిరిజనుల అవస్థలు

-తుప్పపట్టిన పైప్‌లైన్

-ఊట గెడ్డల నీరే ఆధారం

ఊట గెడ్డ నీటిని తెచ్చుకుంటున్న గిరిజన మహిళలు

ప్రజాశక్తి-రోలుగుంట: మంచినీటి కోసం కొండలెక్కుతూ చలమల్లో నీళ్లు తోడుకుని తెచ్చుకోవాల్సిన ఆదివాసీలకు తలెత్తింది. రోలుగుంట మండలం అర్ల పంచాయతీ పెదగరువులో 13 కుటుంబాల్లో 60 మంది పివిటిజి ఆదివాసీలు నివాసం ఉంటున్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఆ ఊరి పేరు లేకపోవడంతో మంచినీటి సదుపాయానికి అవకాశాల్లేవని అధికారులు చెబుతున్నారు. 2019లో మూడు నెలలు కష్టపడి శ్రమదానంతో 40 అడుగుల బావిని గిరిజనులే తవ్వుకున్నారు. ఈ విషయం పత్రికల్లో రావడంతో అధికారులు స్పందించి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి నీటి బావికి విద్యుత్ మోటారు అమర్చి ఇనుప గొట్టాల ద్వారా మంచినీటిని సరఫరా చేశారు. అయితే ఆ వెంటనే గొట్టాలకు తుప్పు పట్టడంతో బురద నీరే వస్తోంది. ఇదే విషయమై గ్రామస్తులు పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో కనిపించిన చోట గెడ్డల్లో చలమల్లో తీసుకునే గిరిజనులు నీరు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా నీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, మండల కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, చలమల్లో నీరు తాగడంతో ఇక్కడ మహిళలు తరచూ అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. తక్షణమే ఇక్కడ మంచినీటి సమస్యను పరిష్కరించాలని లేకుంటే రోలుగుంట ఎంపిడిఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

లోకేష్ కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న నాయకులు

వెంకన్న కల్యాణానికి మంత్రులకు ఆహ్వానం

ప్రజాశక్తి -నక్కపల్లి :ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకటేశ్వర స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవానికి రావాలని కోరుతూ హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో స్థానిక నాయకులు పలువురు మంత్రులకు వెంకన్న ఆహ్వాన పత్రికను అందజేశారు. విజయవాడలో మంత్రులు నారా లోకేష్, అనగాని సత్యప్రసాద్, గుమ్మిడి సంధ్యారాణి తదితర మంత్రులకు హోం మంత్రి అనిత సమక్షంలో స్వామివారి కళ్యాణ ఆహ్వాన పత్రికను నక్కపల్లి తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, ఉపమాక వెంకన్న ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కురందాసు నూకరాజు, నాయకులు కొప్పిశెట్టి వాసు అందజేశారు. కళ్యాణ మహోత్సవానికి రావాలని మంత్రులను కోరారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

14న సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఈ నెల 14న పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ వేదికగా నిర్వహించనున్న జనసేన పార్టీ ఆవిర్భావ సభను నియోజకవర్గ జనసైనికులు జయప్రదం చేయాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం నర్సీపట్నం కృష్ణాపేలెస్‌లో ఆవిర్భావ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం సూర్యచంద్ర మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం తర్వాత నిర్వహిస్తోన్న తొలి ఆవిర్భావ సభ కావడంతో పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శులు అల్లాడ సురేశ్, నమ్మి రమణరాజు, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ పాల్గొన్నారు.

96 శాతం పశుగణన పూర్తి

పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ నర్సింహులు

మాట్లాడుతున్న నర్సింహులు

ప్రజాశక్తి -కోటవురట్ల:కోటవురట్ల, మాకవరపాలెం మండలాల్లో 96శాతం పశుగణన పూర్తి చేసినట్టు పశు సంవర్థక డిప్యూటీ డైరెక్టర్ నర్సింహులు తెలిపారు. మంగళవారం ఆయన కోటవురట్ల పశువైద్యశాల వద్ద కోటవురట్ల, మాకవరపాలెం మండలాల పశువైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 14 నుంచి విజయనగరంలో నిర్వహించనున్న పాల పోటీలకు సంబంధించి తీసుకోవాల్సిన ఎంపిక చేయాల్సిన పాడిపశువుల గురించి అధికారులతో సమీక్షించారు. అదేవిధంగా ఈనెల చివరి వరకు జరగనున్న పశువు గణన శతశాతం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పాడి పశువులకు అందజేస్తున్న పశు బీమా పథకం అందరికీ వర్తింప చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నరేష్, డాక్టర్ పడాలి, హరిప్రియ, ప్రతాప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మేలు జాతి పశువులతో అధికంగా పాల దిగుబడి

నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం ప్రాంతీయ పశు వైద్యశాలలో పశుసంవర్థకశాఖ పాడేరు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.నరసింహులు మంగళవారం గొలుగొండ, నర్సీపట్నం పశు వైద్య అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిడి మాట్లాడుతూ అధిక పాలు దిగుబడినిచ్చే మేలు జాతి పశువుల పెంపకంపై ఆసక్తి పెంచాలన్నారు. శాస్త్రీయ పోషణ, యాజమాన్య పద్ధతుల ద్వారా పాల దిగుబడి పెంచవచ్చునని తెలిపారు. ఔత్సాహిక యువ రైతులకు ఆసక్తి పెంచాలన్నారు. ఉత్తరాంధ్ర స్థాయిలో ఈనెల 14, 15, 16 తేదీలలో పాడి పశువులకు మెగా పాల పోటీలు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముర్రా జాతి గేదెలు స్వదేశీ ఆవులు, విదేశీ సంకరజాతి ఆవులకు వేరువేరుగా నిర్వహించే ఈ పోటీలలో మొదటి ప్రైజ్ సుమారు రూ.50వేలు, రెండో ప్రైజ్ రూ.40వేలు, మూడో బహుమతి రూ.25వేలుగా నిర్ణయించారన్నారు. రెండు రోజుల పాటు నిపుణులచే పశుపోషణలో మెలకువలు, ముఖాముఖి సదస్సు లు నిర్వహిస్తారన్నారు.ఆసక్తి గల రైతులు సమీపంలోని రైతు సేవ కేంద్రం వద్ద నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, నర్సీపట్నం, గొలుగొండ పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యులు

ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:గర్భిణీలను పర్యవేక్షించడంలో ఆశా కార్యకర్తలు నిర్లక్ష్యం చేయరాదని పి.హెచ్.సి వైద్యులు సంతోష్ కుమార్ సూచించారు. మంగళవారం వెంకటాపురం గ్రామంలో ఆశా కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. గర్భిణీ స్త్రీల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, వారికి సకాలంలో చేయాల్సిన పరీక్షలు, అందించాల్సిన పోషక విలువల గురించి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాలలో సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గోవిందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నేత వెంకటేష్

ధాన్యం కొనుగోలు చేస్తాం

ప్రజాశక్తి- నక్కపల్లి :రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తామని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. గొడిచెర్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు చేయాలని వైసిపి, సిపిఎం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం వెంకటేష్ స్పందించారు. పార్టీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. ధాన్యం కొనుగోలుపై అధికారులతో మాట్లాడడం జరిగిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, నాయకులు వైబోయన రమణ, దార్ల కష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వేంపాడు విద్యుత్ సబ్ స్టేషన్ 11 కె. వి గొడిచెర్ల ఫీడరు మరమ్మత్తు పనుల నిమిత్తం ఈనెల 5న బుధవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు చిన్నదొడ్డిగల్లు, ముకుందరాజుపేట, రమణయ్యపేట, డొంకాడ,జె జె పురం, చీడిక, రేవల్ల కొత్తూరు, తిరుపతిపాలెం, దోసలపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్ కో ఎఇ కృష్ణ ప్రకటనలో తెలిపారు. మరమ్మత్తు పనులు చేయడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అల్పాహారం అందజేస్తున్న నిర్వాహకులు

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని పెదబోదుగల్లం జిల్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు కొల్లేరు ఐటిఐ నిర్వాహకులు అల్పాహారం అందజేశారు. హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో 45 రోజుల నుండి పదవ తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి చినగుమ్ములూరు కొల్లేరు ఐటిఐ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ బి.గోపాలరావు, ట్రైనీ ఆఫీసర్ మందపాటి కృష్ణ, ఇన్ ఛార్జ్ శ్రావణిశిరీష, సూర్య, అరుణ్ కుమార్ లు విద్యార్థులకు రుచికరమైన అల్పాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.ఫల్గుణరావు, ఎస్.వి.ఎస్.ఆచార్యులు, ఎ.వి.ఎల్.ఎన్ కుమారి, చిన్నారావు, రమేష్ బాబు, శ్రీదేవి పాల్గొన్నారు.

ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి -నక్కపల్లి :ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న వార్షిక కళ్యాణ ఉత్సవాలు సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం సిఐ కుమారస్వామి పరిశీలించారు. ఆలయ పరిసర ప్రాంతాలు, పార్కింగ్ ప్రదేశాలు, క్యూ లైన్, విఐపి దర్శన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెంకన్న ఉత్సవాలకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు, నాయకులు వాసు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఐ కుమారస్వామి

పరిహారమిచ్చి పనులు చేపట్టండి

-తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతుల ధర్నా

ప్రజాశక్తి- పెందుర్తి : ఏళ్లతరబడి తమ సాగు అనుభవంలో ఉన్న భూముల్లో ఎటువంటి సమాచారం, పరిహారం ఇవ్వకుండా, రైల్వేశాఖ అధికారులు పనులు చేస్తున్నారని మండలంలోని చీమలాపల్లి, లక్ష్మీపురం, పోర్లు పాలెం, చింతల అగ్రహారం గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, దశాబ్దాలుగా సాగుచేస్తూ, వచ్చిన ప్రతిఫలంతో జీవనోపాధి పొందుతున్న తమకు, ఆ భూములను తీసుకుంటే జీవనం కష్టమౌతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నాళ్లుగా సింహాచలం దేవస్థానం భూములంటూ చెప్పుకొచ్చారని, ఇపుడు రైల్వేశాఖ తరపున నెలరోజుల క్రితం వచ్చి సర్వే, పనులు చేస్తుండగా తాము అభ్యంతరం చెప్పామన్నారు. రెండు రోజులుగా ఆయా భూముల్లో తాము నిరసన వ్యక్తం చేస్తున్నా అధికారులెవరూ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ అనుభవంలో ఉన్న భూముల్లో పనులు చేయాలంటే నష్టపరిహారం ఇవ్వాలని అభ్యర్థించగా, సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు చేపడతామని మాటిచ్చారన్నారు. ఇపుడు అలాంటిదేమీ లేకుండా పనులను కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్ ఇతర అధికారులకు మొరపెట్టుకున్నా ఎటువంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులంతా, తమ జీవనోపాధి దూరమౌతున్నందున పరిహారం ఇచ్చేంతవరకు దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో పోర్లు పాలెం మాజీ ఉపసర్పంచ్ గల్లా వెంకటరమణ చింతలగ్రహారం మాజీ సర్పంచ్ పొలమరశెట్టి వెంకటరమణ, రైతు సంఘం సభ్యులు పెంటకోట వెంకటరమణ, ప్రేమ్ కుమార్, రావర్తి నాగార్జున తదితరులు పాల్గొన్నారు

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

వినతిపత్రాన్ని ఇస్తున్న ఆశావర్కర్లు

సమస్యలపై ఆశా వర్కర్ల వినతి

ప్రజాశక్తి- రావికమతం:తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని కోరుతూ ఈనెల 6న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆశ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వజ్రపు సత్యవతి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రావికమతం పి హెచ్ సి వైద్యాధికారి శ్రీనివాస్ కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వజ్రపు సత్యవతి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 6న చలో విజయవాడ కార్యక్రమానికి రాష్ట్రంలో గల ఆశా కార్యకర్తలందరూ హాజరుకావాలని తెలిపారు. తాము శాంతి యుతంగా తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని పలుమార్లు ధర్నాలు, నిరసనలు తెలియజేసినప్పటికీ ఎటువంటి స్పందన లేక పోవడంతో చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ నాయకులు ఎస్.లక్ష్మి పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎఒ

ఫార్మర్ రిజిష్ట్రేషన్ చేయించుకోవాలి

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం టి.అర్జాపురం, పి. కొట్నాబిల్లి గ్రామాలలో మంగళవారం మండల వ్యవసాయాధికారి డి.రూప ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రూప మాట్లాడుతూ, వేరుశనగ, నువ్వులు, రాగి పంట లలో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ పిఎం కిసాన్ పొందుతున్న రైతులు మండలంలో సుమారు 11,982 మంది ఉండగా కేవలం 6,216 మంది రైతులు మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. మిగతా రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ త్వరగా చేయించు కోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయధికారి కె రత్నం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్

భూ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- కోటవురట్ల: రీ సర్వే ఫిర్యాదులతో పాటు రెవెన్యూ శాఖలో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని తహసిల్దార్ తిరుమల బాబు ఆదేశించారు. మంగళవారం గ్రామ రెవెన్యూ అధికారులు, విలేజ్ సర్వేయర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులు పూర్తికాగా, రీ సర్వే లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి సిబ్బంది పూర్తిస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు, ప్రధానంగా రీ సర్వేలో వచ్చిన ఫిర్యాదులు దాదాపుగా పూర్తి చేసామని అన్నారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన ఫిర్యాదులు పూర్తిస్థాయిలో పరిష్కరించినట్లు తెలిపారు. ఇసుక, మట్టి గ్రావెల్,అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిటి రమేష్, ఆర్ఐ ఊర్ధవరావు పాల్గొన్నారు.

పంచాయతీ ఇఒ తీరుపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కొత్తకోట:కొత్తకోట మేజర్ పంచాయతీ కార్యనిర్వా హణాధికారి(ఈవో) జ్యోతిరెడ్డి పంచాయి తీ పాలనను గాలికి వదిలేసి తన ఇష్ట రీతిలో వ్యవరిస్తున్నారని కొత్తకోట సర్పంచ్ కొన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, ఎంపిటిసి లు పూడి దేవ, పైల చిన్నమ్మలు పలువురు వార్డు సభ్యులు ఆరోపించారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ, పంచాయతీ పాలనా పరమైన సమస్యలపై ఈవో నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారన్నారు. పంచాయతీ కి ఆదాయం సమకూర్చేందుకు గ్రామంలో ట్రాఫిక్ సమస్య నివారణకు సుమారు 18 లక్షలు నాబార్డు, పంచాయతీ నిధులతో మార్కెట్ యార్డును నిర్మించా మన్నారు. మార్కెటింగ్ నిర్వహణ పై పంచాయతీ పాలక వర్గం తీర్మానాన్ని అమలు చేయడం లేదన్నారు. స్థానికం గా షిరిడి సాయి, వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయాల సమీపంలో మాంసం, చేపలు విక్రయాలు, హిందూ మనో బావాల పై ఫిర్యాదు లు వచ్చినా పట్టించు కోలేదన్నారు. మూడవ సచివాలయం గేట్ కు ఎదురు గా గ్రామ కంఠం స్థలాన్ని గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించి శాశ్వత కట్టడాలు చేయడం పై పాలక వర్గ సభ్యులు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. ఈవో అందు బాటు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికార పార్టీ నాయకుల చెబితేనే చేస్తానని చెబుతున్నారన్నారు. ఈవోపై చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తో పాటు మండల అభివృద్ధి అధికారికి ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న సర్పంచ్, ఎంపిటిసిలు

నిలిచిన ఇసుక అక్రమ రవాణా

-ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -కోటవురట్ల: ఉచిత ఇసుకకు వేలం అంటూ ఈనెల 2న ప్రజాశక్తిలో పందూరు, గొట్టివాడ గ్రామాల్లో ఇసుక వేలం నిర్వహణ వెలు వెలువడిన వార్త కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు జిల్లా పౌర సంబంధాల అధికారి ఇరిగేషన్ శాఖ అధికారులను వివరణ అందజేయాల్సిందిగా కోరారు. ప్రజాశక్తి లో వెలువడిన వార్త కథనం తరువాత సంబంధిత రీచ్ ల నుండి ఇసుక రవాణా నిలిచింది. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం నుంచి అనుమతులను సైతం తాత్కాలికంగా నిలిపివేసినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.ఆయా గ్రామాల్లో ఎటువంటి అక్రమ రవాణా జరగకుండా ప్రాంతాలను పరిశీలించడంతోపాటు రెవెన్యూ పోలీస్ అధికారుల సహకారంతో అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపాయి. గృహ అవసరాలకు, ప్రభుత్వ అభివృద్ధి పనులకు మాత్రమే అనుమతులతో కూడిన పర్మిషన్ ఇస్తున్నామని, గుర్తించిన రీచ్లు వద్ద ఎటువంటి రుసుము వసూలు చేయకుండా చర్యలు చేపట్టడంతో పాటు, రెవెన్యూ సిబ్బందిని రీచ్ ల వద్ద అక్రమ రవాణా అక్రమ రవాణా అక్రమ వసూళ్లు జరగకుండా డ్యూటీలు వేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

సర్వేలు వేగవంతం చేయండి

ప్రజాశక్తి -పాడేరు : జిల్లా లో జరుగుతున్న అన్ని రకాల సర్వేలు నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం జె అభిషేక్ గౌడ్ ఆదేశించారు. మంగళవారం వీసీ సమావేశ మందిరంలో ఐటిడిఎ పిఒలు, 22 మండలాల ఎంపిడిఒలతో వర్చ్యువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఎంఎస్ఎంఇ, మిస్సింగ్ సిటిజన్స్, ఆధార్ నమోదు లేని పిల్లలు, జనన మరణాల ఆలస్య నమోదు, స్కూల్ టాయిలెట్ తనిఖీ, వర్క్ ఫ్రమ్ హోం , పి 4 , తదితర సర్వేలు వేగంగా పూర్తి చేయాలని ఎం పి డి ఒ లను ఆదేశించారు. జిల్లాలో ఎంఎస్ఎంఇ సర్వేలో 70 శాతం సర్వే పూర్తి అయిందని ఇంకా 30 శాతం త్వరితగతిన పూర్తి చేయాలనీ సూచించారు. వర్క్ ఫ్రమ్ హోం సర్వే లో భాగంగా సర్వే చేసే విధానాన్ని వివరించారు.

ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం కల్పించాలి

సిఎం చంద్రబాబుకు బివి.రామ్ వినతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం కల్పించాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి రామ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. మంగళవారం ఆయన టిడిపి కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ విషయాన్ని రామ్ స్థానిక మీడియాకు తెలిపారు. యువతకు ఉపాధి కల్పించాలనే తన తండ్రి దివంగత బి.వి.రామారావు ఆశయ సాధనకు తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ టికెట్ కేటాయిస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే విధంగా కృషి చేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక వేళ ఎమ్మెల్సీ అవకాశం కాకపోయినా,ఏదైనా నామినేటెడ్ చైర్మన్ పోస్ట్ కేటాయించాలని కోరారు. ఏది ఏమైనా తెలుగుశక్తి ఎప్పుడూ కూడా తెలుగుదేశం బాటలోనే పయనిస్తుందన్నారు.ఈ సందర్భంగా గత వైసిపి ప్రజా కంటక పాలనపై తాను ఏ విధంగా పోరాటం చేశానో వివరించారు. చంద్రబాబు ఎటువంటి బాధ్యతలు అప్పగించినా సమర్థవంతంగా నిర్వహిస్తానని రామ్ తెలిపారు.

సిఎం చంద్రబాబును కలిసిన బివి.రామ్

మెడిసిన్ పీజీలో శ్రీవాత్సవ్ టాపర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:పోస్ట్ గ్రాడ్యుయేట్ ఫైనల్ పరీక్షలో 800 మార్కులకు 607 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ఆర్థోపెడిక్స్‌లో అత్యధిక స్కోర్ తో, స్టేట్ 1 వ ర్యాంక్ సాధించి, థియరీ మరియు ప్రాక్టికల్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించినందుకు డాక్టర్ జి.శ్రీవాత్సవ్‌ను కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానందతో పాటు పలువురు అభినందించారు.మంగళవారం కెజిహెచ్ లో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు అభినందనలు తెలిపారు. శ్రీవాత్సవ్ కెజిహెచ్ ఆర్థోపెడిక్స్ విభాగం అధిపతి., డాక్టర్ పి. శివానంద మార్గదర్శకత్వంలో 1వ యూనిట్‌లో శిక్షణ పొందారు.ఈ సందర్భంగా డాక్టర్ శివానంద మాట్లాడుతూ, శ్రీవాత్సవ్‌కు ఆర్థోపెడిక్స్‌లో రాణించాలనే అంకితభావం, పట్టుదల, అభిరుచికి ఈ అత్యుత్తమ విజయం నిదర్శనం అన్నారు.ఆయన కెరీర్ లో మరిన్ని గొప్ప విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.లోకనాథ్, ప్రొఫెసర్ డాక్టర్ ఎంసి హెచ్ నాయుడు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.


శ్రీవాత్సవ్‌ను అభినందిస్తున్న కెజిహెచ్ సూపరింటెండెంట్, ప్రొఫెసర్లు